ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
జయశంకర్ భూపాలపల్లి
ములుగు
5
శుక్రవారం 5 జనవరి 2024



మేడారానికి ఖాకీ సైన్యం

మహా జాతరకు సిద్ధమవుతున్న పోలీసు శాఖ


2022 జాతరలో విధుల్లో పాల్గొన్న పోలీసులు (ఫైల్)

- ఈసారి 2 కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా
- పదివేల మందికి పైగా సిబ్బందితో బందోబస్తుకు సన్నాహం
- సీసీ కెమెరాలు, పార్కింగ్ స్థలాల పెంపుపై దృష్టి
- అందుబాటులోకి వచ్చిన శాశ్వత కమాండ్ కంట్రోల్ సెంటర్

ములుగు, జనవరి 4: మేడారం మహాజాతర నిర్వహణకు సమయం దగ్గర పడుతున్న దృష్ట్యా అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లలో నిమగ్నమైంది. ఇప్పటికే ఆయా శాఖలు తమ పరిధి ఏర్పాట్లను ముమ్మరం చేశాయి. పోలీసు శాఖ కూడా ఇందుకు సిద్ధమైంది. ప్రతి జాతర నిర్వహణ ఈ శాఖకు ప్రతిష్టాత్మకమే. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రమాదాలు, రద్దీ, ట్రాఫిక్ నియంత్రణ తదితర కీలకమైన విభాగాల్లో విజయం సాధిస్తే 90 శాతం జాతర సక్సెస్ అయినట్టే. ఎప్పుడూ అనుసరించే ఫార్ములాను కొనసాగిస్తూనే గతంలో నెలకొన్న సమస్యలను పునరావృతం కానివ్వకుండా వ్యూహ రచన చేస్తున్నారు. జాతరకు ప్రభుత్వం రూ.75కోట్ల నిధులను మంజూరు చేయగా అత్యధికంగా పోలీసు శాఖకు రూ.10.5 కోట్లను కేటాయించింది. ఇప్పటికే పలుమార్లు సమీక్షలు జరగ్గా క్షేత్రస్థాయిలో పర్యటించిన అధికారులు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు. ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజులపాటు జాతర జరగనుండగా తాజాగా ములుగు ఎస్పీ గౌష్ ఆలం బదిలీ అయ్యారు. 2022 మహాజాతర, 2023 మినీ జాతరల విజయవంతంలో ఆయన కీలకంగా వ్యవహరించారు. మహాజాతరకు ముందు ఎస్పీ బదిలీ అంశం ప్రభావం చూపకుండా సమన్వయ లోపాన్ని అధిగమించేందుకు ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

శాశ్వత కమాండ్ కంట్రోల్ సెంటర్

జాతర బందోబస్తు నిర్వహణలో కమాండ్ కంట్రోల్ సెంటర్ పోలీసు శాఖకు గుండెకాయ లాంటిది. ప్రతిసారీ తాత్కాలిక టెంటులో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేసి పోలీసు ఉన్నతాధికారులు ఇక్కడి నుంచే పర్యవేక్షించే వారు. వందలాది సీసీ కెమెరాలు, ఇతర సాంకేతిక పరికరాల నిర్వహణ కోసం ఐటీడీఏ గెస్ట్‌హౌస్ ఆవరణలోని భవనాలను వినియోగించుకునేవారు. ఈసారి శాశ్వత ప్రాతిపదికన కమాండ్ కంట్రోల్ సెంటర్ కోసం ప్రభుత్వం భవనాన్ని నిర్మించింది. డిసెంబరు 17న రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క చేతుల మీదుగా ప్రారంభించారు.

2 కోట్ల మంది భక్తుల కోసం బందోబస్తు

జాతర జాతరకు భక్తుల సంఖ్య పెరుగుతోంది. 2020, 2022 జాతరల సమయంలో కొవిడ్ భయపెట్టింది. అయినా మేడారం జనసంద్రమైంది. 2022లో వైరస్ వ్యాప్తి యాక్టివ్‌గా ఉండటంతో చాలామంది ముందస్తు మొక్కులకు తరలివచ్చారు. దీంతో ప్రధాన జాతరకు కొంతమేరకు రద్దీ తగ్గింది. సుమారు కోటి 20 లక్షల మంది భక్తులు జాతర జరిగే నాలుగు రోజుల్లో మేడారం వచ్చినట్టు అధికార యంత్రాంగం లెక్కగట్టింది. ఈసారి వైరస్ భయం అంతగా లేదు. పైగా వనదేవతలపై విశ్వాసం రెట్టింపవుతోంది. పొరుగు రాష్ట్రాల భక్తులు కూడా తల్లులను దర్శించుకునేందుకు తరలివస్తున్నారు. దీంతో ఈసారి 2 కోట్ల మందికి పైగా వస్తారని పోలీసు శాఖ అంచనా వేస్తోంది. ఈ మేరకు బందోబస్తు చర్యలు చేపట్టాలని యోచిస్తోంది. క్రితం జాతరలో అమలు చేసిన క్రౌడ్ మేనేజ్‌మెంట్‌ను సవరించి అందుకు అనుగుణంగా సిబ్బంది పెంపు, తదితర అంశాలపై దృష్టి సారిస్తున్నారు.

1,500 ఎకరాల్లో పార్కింగ్ స్థలాలు

మేడారం జాతరలో వాహన వినియోగం పెరిగింది. గతంలో ఎక్కువ మంది భక్తులు ఆర్టీసీ బస్సుల్లోనే వచ్చేవారు. కానీ, సొంత కార్లు, ఆటోలు, ట్రాక్టర్లు, టెంపోలు, మినీ గూడ్సు వాహనాల్లో తరలివస్తున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. వచ్చిన వారిలో చాలామంది రెండు నుంచి నాలుగు రోజులపాటు మేడారం పరిసరాల్లో విడిది చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వేలాది వాహనాలకు పార్కింగ్ సౌకర్యం కల్పించడం పోలీసు శాఖకు సవాల్‌గా మారింది. 2022 జాతర సమయంలో పడిగాపూర్ నుంచి మేడారం వరకు.. మేడారం నుంచి తాడ్వాయి వరకు మొత్తం 1,100 ఎకరాల్లో 33 పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. ఈసారి 1,500 ఎకరాల్లో 50కిపైగా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలని పోలీసు శాఖ భావిస్తోంది. ఇందు కోసం క్షేత్రస్థాయిలో స్థలపరిశీలన చేస్తున్నారు. లైటింగ్, తాగునీరు, మరుగుదొడ్ల వసతిని పెంచనున్నారు. ఇదే క్రమంలో మేడారం వచ్చే నలుదిక్కులా ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి పెట్టారు. గత జాతరలో జాతీయ రహదారిపై ప్రతి నాలుగు కిలోమీటర్లకో క్యాంపు, పస్రా- మేడారం దారిలో ప్రతి రెండు కిలోమీటర్లకో క్యాంపును ఏర్పాటు చేశారు. మొత్తం 37హోల్డింగ్ పాయింట్లను సిద్ధం చేశారు. ఈసారి కూడా క్యాంపులను ఏర్పాటు చేయడమే కాకుండా హోల్డింగ్ పాయింట్లను రెట్టింపు చేయనున్నారు.

భారీ బందోబస్తుకు ప్రణాళిక

గత రెండు జాతరలుగా బందోబస్తులో వినియోగిస్తున్న పోలీసుల సంఖ్య పెరిగింది. 2020 జాతరలో 10 వేల మందిని నియమించగా 2022 జాతరలో 10,300 మందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. మరో 2 వేల మందిని అదనంగా అందుబాటులో ఉంచుకున్నారు. ఈసారి భక్తులు, వాహనాల సంఖ్య పెరిగే అవకాశముండటంతో సిబ్బందిని కూడా పెంచేందుకు యోచిస్తున్నారు. ఎప్పటిలాగే జాతర నిర్వహణలో అనుభవమున్న అధికారుల సేవలను వినియోగించుకోనున్నారు. ఇటీవలే రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ముగియగా కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం కొలువైంది. ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో తల్లుల దర్శనానికి వచ్చే అవకాశముంది. పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా, కర్ణాటక రాష్ట్రాల నుంచి సాధారణ భక్తులతో పాటు ప్రతిసారి వందలాది మంది ప్రముఖులు కూడా తరలివస్తున్నారు. ఆయా రాష్ట్రాల్లో కూడా గత ఏడాదే ఎన్నికలు జరగ్గా వీవీఐపీల రాక అధికంగా ఉండనుంది. దీంతో ప్రముఖులకు ప్రొటోకాల్ భద్రత కల్పించాల్సి ఉంటుంది. సరిహద్దుల్లో మావోయిస్టు కదలికలు అప్పుడప్పుడు వెలుగుచూస్తూనే ఉన్నాయి. ఈక్రమంలో పటిష్ఠ బందోబస్తుపై పోలీసు ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు.

కృత్రిమ మేధ సహకారం

నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖ స్మార్ట్‌గా ఆలోచిస్తోంది. క్లిష్టమైన కేసులను టెక్నాలజీ సహకారంతో ఛేదిస్తోంది. ఎంతమంది పోలీసు సిబ్బందిని నియమించినా జాతరలో శాంతిభద్రతల పరిరక్షణ ఖాకీలకు కత్తిమీద సాములాంటిదే. ఈనేపథ్యంలో కృత్రిమ మేధను సద్వినియోగం చేసుకోనున్నారు. గతంలో మాదిరిగానే ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, ఫేషియల్ రికగ్నైజేషన్ టెక్నాలజీని ఉపయోగించి అధునాతన కెమెరాల ద్వారా జనం రద్దీని గుర్తించి తొక్కిసలాట జరగకుండా నియంత్రించనున్నారు. ప్రతిసారి జాతరలో సీసీ కెమెరాలు కీలకంగా మారుతున్నాయి. 2022 జాతరలో 382 సీసీ కెమెరాలు, 32 హైడెఫినేషన్ పీటీజెడ్ కెమెరాలను అమర్చారు. ఈసారి వీటి సంఖ్యను 30 శాతం నుంచి 50 శాతం పెంచనున్నారు. పదుల సంఖ్యలో డ్రోన్ కెమెరాలను కూడా వినియోగించనున్నారు.


కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క


2022 జాతర సమయంలో మేడారం పరిసరాల్లో 50 ఎకరాల్లో సిద్ధంచేస్తున్న పార్కింగ్ స్థలం (ఫైల్)

మహాజాతరలో మెరుగైన వైద్య సేవలందించాలి

రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ రవీందర్ నాయక్




సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ రవీందర్ నాయక్

ములుగు కలెక్టరేట్, జనవరి 4: ఫిబ్రవరిలో జరిగే మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతరలో భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు వైద్యాధికారులు, సిబ్బంది కృషి చేయాలని రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ రవీందర్‌నాయక్ అన్నారు. ములుగు కలెక్టరేట్‌లో డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య అధ్యక్షతన గురువారం జరిగిన ఉమ్మడి వరంగల్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్యాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మేడారం మహాజాతరలో వైద్యా ఆరోగ్య శాఖ నిర్వర్తించే బాధ్యతలపై దిశానిర్దేశం చేశారు. జాతరకు తెలంగాణ నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారని, వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని అన్నారు. జాతరలో వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, అధికారుల మధ్య సమన్వయం కలిగి ఉండాలని అన్నారు. డీఎంహెచ్‌వో, జాతర నోడల్ అధికారి అల్లెం అప్పయ్య మాట్లాడుతూ మేడారం మహాజాతరలో విధులు నిర్వర్తించడానికి సంసిద్ధంగా ఉన్నామన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న వైద్యాధికారుల సహాయ సహకారాలు ఎంతో అవసరమని అన్నారు. వివిధ జిల్లాల్లో పనిచేసే వైద్యాధికారులు సైతం జాతర సమయంలో ప్రత్యేక వైద్యసేవలు అందించేవిధంగా ఉత్తర్వులు జారీ చేయాలని హెల్త్ డైరెక్టర్‌ను కోరారు. గతంలో జరిగిన జాతరలను దృష్టిలో పెట్టుకుని తొమ్మిది విభాగాలకు చెందిన ప్రత్యేక వైద్యనిపుణులు అందుబాటులో ఉంటారని తెలిపారు. 2022లో జరిగిన జాతరలో రెండు లక్షల మంది భక్తులకుపైగా ఓపీ సేవలు అందించామన్నారు. ఈసారి జరిగే జాతరకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని అన్నారు. ఈసమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వైద్యాధికారులు సాంబశివరావు, ప్రశాంత్, రమణ, మధుసూదన్, శిరీష, అంబరీష్, ములుగు జిల్లా ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, జనవరి 4: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. పట్టణంలోని కాశీంపల్లిలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన కార్యక్రమానికి గురువారం ఆయన హాజరయ్యారు. ప్రజల నుంచి స్వయంగా దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చోందన్నారు. ఇందులో భాగంగానే ఆరు గ్యారెంటీలను తూచా తప్పకుండా అమలు చేసేందుకు రంగం సిద్ధం చేసిందన్నారు. ఇప్పటికే మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని అమలు చేస్తోందని అన్నారు. రూ.5 లక్షలు ఉన్న ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.10లక్షలకు పెంచిందని అన్నారు. మరో అడుగు ముందుకు వేసి మిగిలిన నాలుగు గ్యారెంటీలను అమలు చేసేందుకు ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని అన్నారు. భూపాలపల్లి నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని అన్నారు. ఆరు గ్యారెంటీలను ప్రతి పేద కుటుంబానికి అందేలా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ అనిల్‌కుమార్, కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్, దార పూలమ్మ, నాయకులు కొంరయ్య, శ్రీనివాస్, రంజిత్, రాజేందర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్

మహదేవపూర్ రూరల్/కాటారం, జనవరి 4: మహదేవపూర్ మండలం అంబట్‌పల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.కోటేశ్వర్‌రావు, కాటారం మండలంలోని ఒడిపిలవంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కె.చంద్రశేఖర్ సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈ మేరకు రెండు మండలాల ఎంఈవో దేవానాయక్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. 'మన ఊరు- మన బడి' పథకం క్రింద అంబట్‌పల్లి ప్రాథమిక పాఠశాలకు నూతన భవనం మంజూరు కాగా ముందున్న పాత బిల్డింగ్‌ను కూల్చివేసినట్టు తెలిపారు. పాత భవనానికి సంబంధించిన కలప, ఇతర సామగ్రిని పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్, ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండా అక్రమంగా వాడుకున్నట్లు ఫిర్యాదు రావడంతో విచారణ చేపట్టి కోటేశ్వరావును సస్పెండ్ చేసినట్లు తెలిపారు. అదే పాఠశాలలో పనిచేస్తున్న టి.సత్తయ్యకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినట్టు పేర్కొన్నారు. కాటారం మండలం ఒడిపిలవంచ జడ్పీహెచ్‌పీఎస్ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న చంద్రశేఖర్ ఉన్నతాధికారుల అనుమతి లేకుండా విధులకు గైర్హాజరవుతుండటంతో చంద్రశేఖర్‌ను సస్పెండ్ చేసినట్టు తెలిపారు. గతంలో రేగొండ మండలం తిరుమలగిరి పాఠశాలలో అనుమతి లేకుండా గైర్హాజరవుతుండటం వల్లే ఆయన సస్పెన్షన్‌కు గురికాగా ఒడిపిలవంచలో పోస్టింగ్ వచ్చిందన్నారు. ఇక్కడా కూడా గైర్హాజరవుతుండటంతో చర్య తీసుకున్నట్టు తెలిపారు.

దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

ములుగు అదనపు కలెక్టర్ శ్రీజ


వెంకటాపూర్ గ్రామసభలో సిబ్బందికి సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

వెంకటాపూర్(రామప్ప), జనవరి 4: ప్రజాపాలన గ్రామసభల్లో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అదనపు కలెక్టర్ పి.శ్రీజ అధికారులు, సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలో గురువారం జరిగిన ప్రజాపాలన గ్రామసభను ఆమె సందర్శించారు. ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి రశీదులు అందజేశారు. ఇప్పటి వరకు స్వీకరించిన దరఖాస్తులు ఎన్ని, ఎక్కువగా ప్రజలు ఏపథకం కోసం దరఖాస్తు చేసుకున్నారనే వివరాలను అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన వివిధ పథకాలతోపాటు ఇతర అంశాలపై ప్రజలు అందించే దరఖాస్తులను సైతం ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలని, వెనువెంటనే వారికి రశీదులు అందించాలని అన్నారు. అనంతరం ఆమె లక్ష్మీదేవిపేటలోని జడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్ పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవడానికి కార్యాచరణ రూపొందించాలని ఉపాధ్యా యులకు సూచించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు స్లిప్‌టెస్టులు నిర్వహించాలని, ప్రతి విద్యార్థి హాజరయ్యేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆ తర్వాత నల్లగుంట అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కేంద్రంలో మౌలిక సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు, ఆశాలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర ఖజానాను ఖాళీ చేశారు..

రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

ఎల్కతుర్తి, జనవరి 4: తెలంగాణ రాష్ట్ర ఖజానాను దోపిడీ దొంగల్లా దోచుకుని, సంపదను పూర్తిగా ఖాళీ చేశారని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ బీఆర్ఎస్ నాయకులపై మండిపడ్డారు. గురువారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ నాయకులు రాష్ట్ర ఖజానాను లూటీ చేశారని ఆరోపించారు. . 390 డెకాయిట్ (దోపిడీదారులు) సెక్షన్‌కు బీఆర్ఎస్ నాయకులందరూ అర్హులేనని ఎద్దేవా చేశారు. న్యాయవాదిగా చట్టాల గురించి తెలిసి మాట్లాడుతున్నానన్నారు.

బీఆర్ఎస్ నాయకులకు చట్టాలు, రాజ్యాంగం గురించి తెలియని దద్దమ్మలని విమర్శించారు. పదేళ్ల పాలనలో ఇచ్చిన హామీలు అమలు నెరవేర్చని బీఆర్ఎస్ నాయకులు నెల రోజులు కూడా పూర్తి చేసుకోని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రవేశపట్టిన ఆరు గ్యారెంటీల అమలును జీర్ణించుకోలేక 420 చీటర్స్ అంటూ బుక్‌లెట్ విడుదల చేయడం వారి అవివేకానికి నిదర్శనమని మండిపడ్డారు. ఇచ్చిన హామీల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.10లక్షల ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేశామని మంత్రి చెప్పారు. మిగతా వాటి కోసం ప్రతి గ్రామంలో ప్రజా పాలన గ్రామసభలు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. అమలుకాని హామీలపై ప్రశ్నించే హక్కు లేకుండా గొంతు నొక్కి, హౌస్ అరెస్టులు, నిర్బంధాలు చేసిన చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిదని గుర్తు చేశారు.

హత్య కేసులో అరెస్టు

నిందితుడిని రిమాండ్‌కు తరలించిన పోలీసులు


నిందితుడి అరెస్టును చూపుతున్న సీఐ కిరణ్ కుమార్

మహదేవపూర్ రూరల్, జనవరి 4 : మహిళ హత్య కేసు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని మహదేవపూర్ సీఐ కిరణ్‌కుమార్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిందితుడిని గురువారం మీడియా ముందు ప్రవేశపెట్టారు. వివాహేతర సంబంధం నేపథ్యంలో మండలంలోని అంబట్‌పల్లిలో బుధవారం హత్య జరిగిన విషయం విదితమే. ఓ యువకుడిని మట్టుబెట్టడానికి వెళ్లిన అదే గ్రామానికి చెందిన నర్సింహస్వామి అతడు అక్కడ లేకపోవడంతో అతడి తల్లి నల్లా పద్మను హత్య చేశాడు. ఆ తర్వాత అక్కడి నుంచి పరారయ్యాడు. తప్పించుకొని తిరుగుతున్న నర్సింహస్వామిని అరెస్టు చేశామని, అనంతరం రిమాండ్‌కు తరలిస్తున్నామని సీఐ తెలిపారు. మీడియా సమావేశంలో ఎస్సై రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

హోరాహోరీగా జిల్లా స్థాయి క్రీడా పోటీలు



చిట్యాల, జనవరి 4: వివేకానంద, సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఏబీవీపీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రీడా పోటీలు గురువారం హోరా హోరీగా సాగాయి. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ క్రీడాంశాల్లో ఈ పోటీలు జరిగాయి. స్థానిక సీఐ వేణుచందర్, ఎస్సై రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. క్రీడల నిర్వహకుడు వేల్పుల రాజ్‌కుమార్, వివిధ పాఠశాలలకు చెందిన పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

← కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

అయోధ్య రాముడి అక్షింతల శోభాయాత్ర

వాజేడు, జనవరి 4 : అయోధ్య నుంచి తరలివచ్చిన రాముడి అక్షింతల శోభాయాత్రను గురువారం నిర్వహించారు. మండలంలోని చీకుపల్లి రామాలయం నుంచి లక్ష్మీపురానికి హనుమాన్ భక్తులు డోలువాయిద్యాల నడుమ తరలించారు. అనంతరం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి, యాసం కమల, రేగ కార్తీక్, గుండెబోయిన శరత్, మడప మధు, పగడయ్య, తెల్లం నర్సింహరావు, గొంది రాము తదితరులు పాల్గొన్నారు.


రాముడి అక్షింతల శోభాయాత్రను నిర్వహిస్తున్న భక్తులు

కాంగ్రెస్‌లోకి అప్పం కిషన్

వై.ఎస్.షర్మిలతో కలిసి తీర్థం పుచ్చుకున్న జిల్లా అధ్యక్షుడు

భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 4: వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు అప్పం కిషన్ కాంగ్రెస్‌లో చేరారు. తమ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేస్తున్నట్టు వైఎస్సార్‌టీపీ వ్యవస్థాపక అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిల గురువారం ప్రకటించారు. అనంతరం కాంగ్రెస్‌లో చేరారు. ఆమెతో కలిసి అప్పం కిషన్ కూడా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ చేతుల మీదుగా ఢిల్లీలో కండువా కప్పుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థి గండ్ర సత్యనారాయణరావు తరఫున విస్తృతంగా పర్యటించిన అప్పం కిషన్ ఆయన గెలుపులో కీలక పాత్ర పోషించారు. రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మార్గదర్శకంలో పనిచేస్తానని, ఏ బాధ్యత ఇచ్చినా నిర్వర్తిస్తూ కాంగ్రెస్ బలోపేతం కోసం కృషి చేస్తానని కిషన్ తెలిపారు.


కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో పార్టీలో చేరుతున్న అప్పం కిషన్

రబీకి రెడీ

- ముమ్మరంగా ప్రారంభమైన వరి నాట్లు
- వ్యవసాయ పనులతో పొలాల్లో సందడి
- పెరిగిన ఎరువుల ధరలు, కూలీ రేట్లు

వివరాలు 8వ పేజీలో...

కూచిపూడి నృత్యంలో సమీక్షారెడ్డికి అవార్డు

సుబేదారి, జనవరి 4: ఉత్తరప్రదేశ్‌లోని మధురలో ఇటీవల జరిగిన 13వ కృష్ణ రంగ్ మహోత్సవంలో భాగంగా నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో హనుమకొండ సుబేదారి ప్రాంతానికి చెందిన కె.సమీక్షారెడ్డి ప్రతిష్టాత్మకమైన ప్రెసిడెంట్ చాయిస్ అవార్డు గెలుచుకుంది. సమీక్షారెడ్డి ఢిల్లీ పబ్లిక్‌స్కూల్‌లో 5వ తరగతి చదువుతోంది. సమీక్షారెడ్డిని గురువారం ఉపాధ్యాయులు అభినందించారు.

7న మడికొండలో రెడ్డి సంక్షేమ సంఘం సమావేశం

కాజీపేట జంక్షన్, జనవరి 4: ఉమ్మడి వరంగల్ జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం, డెయిరీ ఆవిష్కరణ కార్యక్రమాన్ని మడికొండలోని రెడ్డి కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం నిర్వహిస్తున్నట్లు సంక్షేమ సంఘం అధ్యక్షుడు మాదిరెడ్డి రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. విశిష్ట అతిథిగా పాట్నా హైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి లింగాల నర్సింహారెడ్డి పాల్గొంటున్నట్లు తెలిపారు. ప్రత్యేక అతిథులుగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్‌రెడ్డి, దొంతి మాధవరెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, మామిడాల యశస్వినిరెడ్డి హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. రెడ్డి సంక్షేమ సంఘంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా గల సుమారు 3వేల మంది సభ్యులు ఉన్నట్లు రవీందర్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో సంక్షేమ సంఘం ఆదాయం, ఖర్చులు పరిశీలించి, ఇంకా మున్ముందు రెడ్డి కులస్తుల కోసం చేపట్టాల్సిన సంక్షేమ కార్యక్రమాలను సభ్యుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించనున్నట్లు రవీందర్‌రెడ్డి తెలిపారు. రెడ్డి బంధువులందరు సర్వసభ్య సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా ఆయన కోరారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే ధ్యేయంగా..

● కొనసాగుతున్న 'ఆపరేషన్ స్మైల్' కార్యక్రమం ● ఇప్పటివరకు 2,283 మందికి విముక్తి

హనుమకొండ రూరల్, జనవరి 4: వెట్టిచాకిరిలో మగ్గుతున్న చిన్నారులు, అనాథ, వీధి బాలలకు విముక్తి కల్పించి వారికి రక్షణ కల్పించేందుకు యేటా జనవరి మాసంలో ప్రభుత్వం ఆపరేషన్ స్మైల్, జూలై నెలలో ఆపరేషన్ ముస్కాన్ పేరిట కార్యక్రమాలను చేపడుతోంది. బాలల హక్కుల పరిరక్షణ, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే ధ్యేయంగా హనుమకొండ జిల్లాలో 2015 నుంచి ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. బావిభారత పౌరులైన బాలలు బడిలో చదువుకో వాల్సిన సమయంలో కార్మికులుగా మారి భవిష్యత్‌ను అంధకారం చేసుకుంటున్నారని భావించిన ప్రభుత్వం.. ఈ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. యేటా జూలైలో ఆపరేషన్ ముస్కాన్ పేరుతో కార్యక్రమాలు చేపట్టి బాల కార్మికులను గుర్తించి వారికి విముక్తి కల్పిస్తూ బడికి పంపే ఏర్పాట్లు చేస్తుంది. 2015 నుంచి ఇప్పటి వరకు సుమారు 2,283 మంది బాల కార్మికులకు విముక్తి కలిగించారు. నిరక్షరాస్యత, అవగాహన లోపం, పేదరికం కారణంగా పలువురు తమ పిల్లలను పనులకు పంపుతుంటారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించేడమే లక్ష్యంగా అధికారులు యేటా రెండు దపాలుగా కార్యక్రమాలు చేపడుతున్నారు. పోలీసులు, కార్మికశాఖ, బాలల సంక్షేమం కోసం పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, బాలల సంక్షేమ కమిటీ ప్రతినిధుల బృందాలను ఏర్పాటు చేస్తారు.



బాధ్యులపై కేసుల నమోదు

ఈ బృందాలు నెలరోజులపాటు వాహనాల గ్యారేజీలు, హోటళ్లు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు తదితర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి బాలకార్మికులను గుర్తిస్తారు. గుర్తించిన వారిలో 14ఏళ్లలోపు పిల్లలు బాలకార్మికులుగా పనిచేస్తుంటే బాధ్యులపై కార్మికశాఖ కేసులు నమోదు చేస్తుంది. హానికరమైన పనులలో 15-18 యేళ్ల వయస్సున్న వారుంటే కేసులు నమోదు చేస్తారు. గుర్తించిన బాలకార్మికులు కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి వారికి అప్పగిస్తారు. ఒకవే ళ అనాథలుంటే వారిని ఆశ్రమాలకు తరలించి పాఠశాలల్లో చేర్పిస్తారు. బాలలను పనిలో పెట్టుకుంటే యజమానులపై కేసులు నమోదు చేస్తారు. అదృశ్యమైన పిల్లల వివరాలను దర్పణ్ పోర్టల్‌లో నమోదు చేసి, అనంతరం చర్యలకు శ్రీకారం చూడతారు. యాం టీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సహకారంతో అక్రమ రవాణాకు గురైన పిల్లలను గుర్తించేం దుకు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తామరు. తప్పిపో యిన చిన్నారులు, దుర్భర జీవితం గడుపుతున్న వారిని గుర్తించి తల్లిదండ్రులకు, ప్రభుత్వ, వివిధ స్వచ్ఛంద సంస్థలకు అప్పగిస్తారు.

గుర్తించిన బాలకార్మికుల వివరాలు ఇవే..

ఇయర్	ఆపరేషన్ స్మైల్	ఆపరేషన్ ముస్కాన్	మొత్తం
2015	108	178	286
2016	152	172	324
2017	177	110	287
2018	103	113	216
2019	68	211	279
2020	168	–	168
2021	178	228	406
2022	112	95	207
2023	63	47	110

బాలలను పనిలో పెట్టుకుంటే కేసులు

రమేష్‌బాబు, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్



14 ఏళ్లలోపు వయస్సున్న బాల, బాలికలను పనిలో పెట్టుకోవడం నేరం. అలా ఎవరైనా బాల, బాలికలను పనిలో పెట్టుకొని బాలకార్మికులుగా మారిస్తే సంబంధిత యజమానిపై కేసులు నమోదు చేస్తాం. మైనర్లను ఎట్టిపరిస్థితుల్లో పనుల్లో పెట్టుకోవద్దు. ఎవరైనా బాలకార్మికులను గుర్తించినట్లయితే అధికారులకు సమాచారం ఇవ్వాలి.

తనిఖీలు నిర్వహిస్తున్నాం..

సంతోష్‌కుమార్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి



బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా పనిచేస్తున్నాం. తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందుల తో తమ పిల్లలను పని చేర్పిస్తున్నారు. వ్యాపారులు పిల్లల కు తక్కువ జీతాలు ఇచ్చి పనిలో పెట్టుకుంటున్నారు. తప్పిపోయిన పిల్లలు, బాలకార్మికులు ఉన్నట్లయితే 1098కు సమాచారం అందించాలి. బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే కేసులు నమోదు చేస్తాం.

ఎమ్మెస్పీతోనే సామాజిక, రాజకీయ న్యాయం

ఎమ్మెస్పీ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ

హసన్‌పర్తి, జనవరి 4: మహజన సోషలిస్టు పార్టీ (ఎమ్మెస్పీ)తోనే సామాజిక రాజకీయ న్యాయం జరుగుతుందని ఆ పార్టీ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ అన్నారు. ఎమ్మెస్పీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం హసన్‌పర్తి మండల కేంద్రంలో పార్టీ జెండావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంద కుమార్ మాట్లాడుతూ.. ఎమ్మెస్పీ పేదల కోసం ఏర్పాటు చేయడం జరిగిందని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కులాలకు సామాజిక, రాజకీయ, ఆర్థిక న్యాయం జరుగుతుందన్నారు. తెలంగాణలోని అన్ని పార్టీలు అగ్రకుల పార్టీలేనని, వాటి ద్వారా న్యాయం జరుగదన్నారు. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో రాబోయే రోజుల్లో మహజనులతో కలిసి మహజన రాష్ట్రాన్ని స్థాపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్, నాయకులు రాజారపు భిక్షపతి, ఆరెపెల్లి పవన్, రాజారపు కిరణ్, ఆకారపు రాజు, బొక్క సాంబరాజు, కుక్కమూడి మొగిలి, నమీండ్ల సూర్యం, మేకల రమేశ్, మేకల కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.


హసన్‌పర్తిలో ఎమ్మెస్పీ జెండావిష్కరిస్తున్న నాయకులు

లూయిస్ బ్రెయిలి జయంతి వేడుకలు


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అతిథులు

హనుమకొండ టౌన్, జనవరి 4: హనుమకొండ జిల్లా పరిషత్ హాల్‌లో తెలంగాణ అంధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో గురువారం లూయిస్ బ్రెయిలి 215వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, ట్రెయినీ కలెక్టర్ రాజీవ్ శుక్లా, హనుమకొండ, వరంగల్ డీడబ్ల్యూవోలు మధురిత, శారద, ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్, అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్‌పర్సన్ కె.అనితారెడ్డి, ప్రమోద హాస్పిటల్ డైరెక్టర్ వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అతిథుల చేతుల మీదుగా 2024 బ్రెయిలి క్యాలెండర్ ఆవిష్కరించారు. బ్రెయిలి జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అంధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు ఎస్.రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కె.రాజు, ఉపాధ్యక్షుడు కృష్ణ, కోశాధికారి జి.శ్రీను, అసోసియేట్ అధ్యక్షుడు ఎల్.రవిందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.కార్తిక్, సంయుక్త కార్యదర్శి కమల, సలహాదారులు విజయచందర్ తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో విద్యార్థులకు పతకాలు


విద్యార్థులను అభినందిస్తున్న తాళ్ల మల్లేశం

కాజీపేట, జనవరి 4: ఇటీవల కేరళలో జరిగిన జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలో కాజీపేట సోమిడి తాళ్లపద్మావతి ఒలంపియాడ్ స్కూల్ విద్యార్థులకు కాంస్య పతకాలు లభించాయి. పతకాలు లభించిన వారిలో ఏడో తరగతి చదువుతున్న అయాన్ నాయక్, తొమ్మిదో తరగతి చదువుతున్న సాయిచరణ్ ఉన్నారు. వీరిని గురువారం తాళ్ల పద్మావతి పాఠశాల ఆవరణలో విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం అభినందించారు.


రెండు రోజులు నీటి సరఫరా బంద్

జీడబ్ల్యూఎంసీ (హనుమకొండసిటీ), జనవరి 4: ధర్మసాగర్ నుంచి వచ్చే మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్‌కు అమ్మవారిపేట వద్ద ఏర్పడిన లీకేజీ కారణంగా వరంగల్ పరిధిలో రెండు రోజులపాటు నీటి సరఫరా ఉండదని ఈఈ శ్రీరామోజు శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కరీమాబాద్, ఉర్సు, శివనగర్, పెరుకవాడ, చింతల్, ఖిలావరంగల్, తూర్పు, మధ్య కోట, ఎస్ఆర్ఆర్ తోట, యాసీ రెడ్డినగర్, నాగమయ్యగుడి, రుద్రమనగర్ ప్రాంతాల్లో శుక్ర, శనివారాల్లో సరఫరా ఉండదని ఈఈ తెలిపారు.

డిగ్రీ ఈ-కామర్స్ ప్రశ్నపత్రంలో రెండుసార్లు ఒకే ప్రశ్న

ఆందోళనకు గురైన ఫైనల్ ఇయర్ విద్యార్థులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 4 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో గురువారం జరిగిన బీకాం ఫైనల్ ఇయర్ 5వ సెమిస్టర్‌లోని ఈ-కామర్స్ పరీక్ష పత్రంలో ఒకేప్రశ్న రెండుసార్లు వచ్చింది. దీంతో ఆ సబ్జెక్ విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. వర్సిటీ పరిధిలో డిసెంబరు 20వ తేదీ నుంచి డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు మొ దటి సెమిస్టర్, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మూడోసెమ్, తృతీయ సంవత్సరం విద్యార్థులకు ఐదోసెమ్ పరీక్షలు జరుగుతున్నాయి. ఇవి ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యా హ్నం 2 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందులో అందు లో భాగంగా గురువారం డిగ్రీ ఫైనల్ విద్యార్థులకు జరుగుతున్న ఐదో సెమిస్టర్ ఈ-కామర్స్ ప్రశ్నాపత్రం సెక్షన్-ఏలో 8 ప్రశ్నలకు గాను ఐదు ప్రశ్నలకు సమధానాలు రాయాల్సి ఉంటుంది. ప్రతీ ప్రశ్నకు మూడు మార్కుల చొప్పున ఐదు ప్రశ్నలకు 15 మార్కులు కేటాయించారు. కాగా, ప్రశ్నాపత్రంలోని 1లో ఏ నుంచి హెచ్ వరకు 8 ప్రశ్నలుండగా అందు లో బి,హెచ్ ప్రశ్నలు (వాట్ ఈజ్ సెర్చ్ ఇంజన్) ఒకేలా ఉన్నాయి. దీంతో డిగ్రీ విద్యార్థులు అయోమయానికి గురయ్యారు. 8 ప్రశ్నలకు గాను ఐదింటికి సమాధానాలు రాయాల్సి ఉండగా మూడు ప్రశ్నలు చాయిస్ కింద పోతాయి. అయితే ఈ కామర్స్ ప్ర శ్నాపత్రంలో రెండు ప్రశ్నలు ఒకేలా ఉండడంతో ఒక్కచాన్స్ కోల్పోయామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రశ్నాపత్రం తయారు చేసిన అ ధికారులు ఈ తప్పిదాన్ని గుర్తించకపోవడంతో తమకు అన్యాయం జరిగిందని వారు వాపోతున్నారు.


కాకతీయ యూనివర్సిటీ డిగ్రీ ఫైనల్ ఇయర్ ఐదో సెమిస్టర్ ఈ-కామర్స్ రెండుసార్లు వచ్చిన ఒకేప్రశ్న

జనగామలో కేయూ పరీక్షా కేంద్రాల తనిఖీ

కేయూ క్యాంపస్, డిసెంబరు 4: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ మొదటి, మూడో, ఐదో సెమిస్టర్ పరీక్షల కేంద్రాలను గురువారం జనగామలో కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మ ల్లారెడ్డి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బన్న అయిలయ్య బృందం తనిఖీలు నిర్వహి ంచింది. జనగామలోని ఏకశిల డిగ్రీ, పీజీ కళాశా లలు, ఆర్ఆర్ఎం, రాజరాజేశ్వరి డిగ్రీ కళాశాల పరీక్షల కేంద్రాలను తనిఖీలు చేశారు. అలాగే గురువారం వరంగల్ నగరంలో ఏఎస్ఎం డిగ్రీ పీజీ కళాశాల కేంద్రాన్ని కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎం.తిరుమలదేవిల్లు ఎవి ఇతర అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఎఎం కళాశాలలో చూచిరాతకు పాల్పడిన విద్యార్థులను పట్టుకుని ముగ్గురిని డీబార్ చేసినట్లు డాక్టర్ తిరుమదేవి వెల్లడించారు. పరీక్షల ప్రశాంతంగా నిర్వహించాలని సంబం, దిత అధికారులకు చూచించారు.


పరీక్షల కేంద్రాలను తనిఖీ చేస్తున్న పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి, బన్న అయిలయ్య

కేయూ డిగ్రీ పరీక్షల్లో 36 మంది డీబార్

కాకతీయ యూనివర్సిటీ గురువారం ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాలో చూచిరాతకు పాల్పడిన విద్యార్థులను తనిఖీ అధికారులు పట్టుకుని డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎం.తిరుమలదేవిలు గురువారం వెల్లడించారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లో 16 మంది, వరంగల్‌లో 14 మంది, ఖమ్మంలో 6 మంది డీబారైనట్లు తెలిపారు. పరీక్షల నిబంధనల మేరకు వీరిపై చర్యలు చేపడుతామని వెల్లడించారు.

ఎవరికీ పట్టని 'కాజీపేట'

సమస్యల వలయంలో జంక్షన్ ● విస్తరణకు నోచుకోని చౌరస్తా ● ఐదేళ్లుగా పూర్తికాని ఆర్వోబీ ● ప్రతిపాదనలకే పరిమితమైన ఆస్పత్రి ● ఊసేలేని బస్టాండ్ నిర్మాణం



విస్తరణకు నోచుకోని కాజీపేట చౌరస్తా



అసంపూర్తిగా నిర్మించిన ఆర్వోబీ

కాజీపేట, జనవరి 4: హైదరాబాద్ - వరంగల్ ప్రధాన రహదారి.. రైల్వే పరంగా నిత్యం 150 రైళ్ల రాకపోకలు.. రోజూ వేలాది మంది ప్రయాణాలతో నిత్యం రద్దీగా ఉండే ట్రైసిటీలో భాగమైన కాజీపేట జంక్షన్ సమస్యలకు నిలయంగా మారింది. ఎన్ని ప్రభుత్వాలు మారినా.. ఎందరు పాలకులు మారినా.. ఏ పార్టీ అధికారంలో ఉన్నా.. కాజీపేట మాత్రం అభివృద్ధిలో ఆమడ దూరంలోనే ఉంటోంది. ప్రతీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు కాజీపేట అభివృద్ధిపై హామీలు ఇస్తూ ఎన్నికల్లో గెలిచిన తరువాత ఆ ఊసే మరిపోతున్నారు. ఇది యాభై ఏళ్లుగా జరుగుతున్న తతంగమే.. ఎవరు ప్రతిపక్షంలో ఉన్నా అధికారంలో ఉన్న వారిని విమర్శిస్తూ మళ్లీ వారు అధికారంలో రాగానే అదే తంతు కొనసాగిస్తున్నారు.

ఐదేళ్లుగా పూర్తికాని ఆర్వోబీ

కాజీపేట ఫాతిమానగర్‌లో అదనంగా నిర్మించడానికి తలపెట్టిన ఆర్వోబీ నిర్మాణం ఐదేళ్ల కిందట ప్రారంభించారు. అది ఇప్పటికీ పూర్తికాలేదు. అక్కడే ఉన్న పాత బ్రిడ్జిని 50 యేళ్ల కిందట అప్పటి జనాభాకు అనుగుణంగా నిర్మించారు. ప్రస్తుతం ఆ బ్రిడ్జి అక్కడక్కడా పెచ్చలూడుతూ ఎప్పుడు కూలుతుందో నని ప్రయాణికులు భయం, భయంగా ప్రయాణించే పరిస్థితి నెలకొంది. పైగా హైదరాబాద్ - వరంగల్ ప్రధాన రహదారి ఇది ఒక్కటే. హైదరాబాద్ నుంచి వరంగల్ వచ్చే ప్రజాప్రతినిధులు ఇదే బ్రిడ్జిగుండా ప్రయాణిస్తుంటారు. ఇక ఉదయం సమయాల్లో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు వివిధ పనులకు వెళ్లే ప్రయాణికులతో రద్దీగా ఉంటోంది. ఏదైనా చిన్న ప్రమాదం జరిగితే గంటలకొద్దీ ట్రాఫిక్‌జామ్ అవుతోంది. కొత్త బ్రిడ్జి నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందోనని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

విస్తరణకు నోచుకోని చౌరస్తా..

ట్రైసిటీలో చౌరస్తాలన్నీ దాదాపు విస్తరించారు. కొన్ని మోడల్ జంక్షన్లుగా రూపుదిద్దారు. కాజీపేట - వరంగల్ ప్రధాన రహదారి కాజీపేట చౌరస్తాను మాత్రం ఇప్పటికీ విస్తరించలేదు. సాయంత్రం అయ్యిందంటే నిత్యం రద్దీగా ఉండి ప్రమాదాలు జరుగుతుంటాయి. ఈ చౌరస్తా చూస్తేనే ఏదో గజిబిజి ప్రాంతంగా ఉంటోంది.. చౌరస్తా మధ్యలో వాటర్ ఫౌంటేన్, సెంట్రల్ లైటింగ్ నిర్మాణం చేస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు గతంలో పలు సందర్భాలలో ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు ఆ ఊసే మరిచారు.

వంద పడకల ఆస్పత్రికి సుస్తీ

కాజీపేటలో వందపడకల ఆస్పత్రి నిర్మాణానికి సుస్తి చేసింది. పదేళ్ల కిందట కాజీపేట మినీ మునిసిపాలిటీలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి చర్యలు చేపట్టిన ప్రభుత్వం.. గదుల నిర్మాణం, ఆస్పత్రికి కావాల్సిన అన్ని సౌకర్యాలు నిర్మించినప్పటికీ అది ఇప్పటికీ పూర్తికాలేదు. సాక్షాత్తూ నాటి ఆరోగ్య శాఖమంత్రి లక్ష్మారెడ్డి కాజీపేటలో మినీ ఆస్పత్రి నిర్మిస్తామని చెప్పి హామీ ఇచ్చినా ఇప్పటికీ పూర్తి కాలేదు. కాజీపేట, పరిసర ప్రాంత ప్రజలు అనారోగ్యానికి గురైనా, గర్భిణులు, వృద్ధులు వైద్యం కోసం హనుమకొండలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాల్సిందే.

బస్టాండ్ ఊసేలేదు..

కాజీపేటలో ఇప్పటికీ బస్టాండ్ లేదు. రోడ్డుపైన ఒక చిన్న రేకుల షెడ్డులోనే బస్టాండ్‌ను నడిపిస్తున్నారు. హనుమకొండ, వరంగల్ నుంచి హైదరాబాద్‌కు బస్సుల ద్వారా వెళ్లాల్సిన ప్రయాణికులకు ఇక నరకమే. ఎండాకాలం వస్తే ఎండకు, వర్షాకాలం వస్తే వర్షానికి ప్రజలు తడుచుకుంటూ బస్టాండ్‌లో వేచి ఉండాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ముప్పై ఏళ్లుగా కాజీపేటలో బస్టాండ్ నిర్మించాలని నాటి మంత్రి దాస్యంప్రణయ భాస్కర్ ఎన్నో ఉద్యమాలు చేశారు. చౌరస్తా సమీపంలో ఆర్టీసీ సుమారు 15 ఎకరాల స్థలాన్ని పరిశీలించి హద్దులు కూడా వేశారు. ప్రైవేట్ వ్యక్తుల స్థలానికి మార్కెట్ రేటు కట్టివ్వకపోవడంతో అది రద్దయ్యిందని స్థానికులు తెలుపుతుంటారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కాజీపేటలో బస్టాండ్ నిర్మాణం ఊసే లేదు. ప్రతి ఎన్నికల్లో కాజీపేటను అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామని చెప్పే నాయకులు ఈసారైనా కాజీపేట అభివృద్ధికి తోడ్పడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ములుగు ఏజెన్సీలో పడిపోతున్న ఉష్ణోగ్రతలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతున్నాయిన ముఖ్యంగా ములుగు ఏజెన్సీ మండలాల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉంటోంది. కన్నాయిగూడెం, ఏటూరునాగారం, వాజేడు, మంగపేట, వెంకటాపురం(నూగురు), తాడ్వాయిలోని పలు ప్రాంతాలలో రాత్రి ఉష్ణోగ్రతలు 16డిగ్రీల సెల్సియస్‌గా నమోదవుతున్నాయి. పగటి పూట సగటున 31 డిగ్రీలుగా ఉంటోంది. చలికి తోడు తెల్లవారుజాము నుంచి పొగమంచు కురుస్తోంది. ఉదయం 9గంటల వరకు ఈ ప్రభావం ఉంటోంది. శ్వాసకోస వ్యాధులు ఉన్న వారు ఇబ్బందులు పడుతున్నారు.భూపాలపల్లి జిల్లాలో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. రాత్రి సమయంలో చలి తీవ్రమవుతోంది. జిల్లాలో గురువారం గరిష్ఠంగా 30 డిగ్రీలు, కనిష్ఠంగా 17 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. హనుమకొండ జిల్లాలో గత నాలుగు రోజులుగా చలి తీవ్రత పెరుగుతోంది. ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు ఉన్నప్పటికీ చలి తీవ్రత మాత్రం తగ్గడం లేదు. ఉదయం 9 గంటల వరకు కూడా పొగమంచు తీవ్రగా కమ్ముకొని ఉంటుంది. సాయంత్రం 4 గంటలకే చలి ప్రారంభం అవుతోంది. నాలుగు రోజులుగా చలి తీవ్రత ఈ విధంగా నమోదు అయింది. సోమవారం (ఉష్ణోగ్రత 28.9- 15.5), మంగళవారం (ఉష్ణోగ్రత 29.1- 16.8), బుధవారం (28.7- 17.0), గురువారం (29.4- 15.8)గా నమోదు అయింది.

జనగామలో 15.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత

చలి కాలం కావడంతో జనగామ జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గురువారం జిల్లాలో 15.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. జిల్లాలో అత్యల్పంగా చిల్పూరు మండలంలోని మల్కాపూర్‌లో 15.5 డిగ్రీలు, పాలకుర్తి మండల కేంద్రంలో 15.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవ్వగా.. అత్యధికంగా దేవరుప్పుల మండలంలోని కోలుకొండ గ్రామంలో 18.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

టీఎన్‌జీవోస్ మెంబర్‌షిప్ పెంచాలి

టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు ఆకుల రాజేందర్



మాట్లాడుతున్న టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు ఆకుల రాజేందర్

హనుమకొండ రూరల్, జనవరి 4: ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం కృషిచేస్తున్న ఏకైక సంఘం టీఎన్‌జీవోస్ యూనియన్ మాత్రమేనని టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు ఆకుల రాజేందర్ తెలిపారు. గురువారం హనుమకొండలో టీఎన్‌జీవోస్ స్కూల్ ఎడ్యుకేషన్ ఫోరం కార్యవర్గ సమావేశం ఫోరం అధ్యక్షుడు కలకోట్ల భరత్ అధ్యక్షతన నిర్వహించారు. నూతనంగా ఉద్యోగ విధుల్లో చేరిన సభ్యులకు యూనియన్ మెంబర్‌షిప్ అందజేస్తామన్నారు. ప్రతీ ఉద్యోగి క్రమశిక్షణతో వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, శ్యాంసుందర్, రాముునాయక్, సారంగపాణి, లక్ష్మీప్రసాద్, రాజేష్‌ఖన్నా, మిస్బా, ఆనంద్‌బాబు, సతీష్‌చంద్ర, జైవీర్, అలీ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాపాలన'లో ప్రొటోకాల్ ఉల్లంఘనలు

ఐనవోలు, జనవరి 4: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'ప్రజాపాలన' సమావేశాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రొటోకాల్‌ను ఉల్లంఘిస్తూ వేదికలపై ఆసీనులవుతుండటం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాపాలనలో భాగంగా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ప్రొటోకాల్ ప్రకారం సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులే స్టేజీపై కూర్చోవాలి. కానీ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు హాజరైన సందర్భాల్లో వేదికపైకి పిలవకపోయినా కొందరు మండల, జిల్లా నాయకులు నేరుగా వచ్చి కూర్చుంటున్నారు. గురువారం కక్కిరాలపల్లిలో జరిగిన ప్రజాపాలన గ్రామసభలో వేదికపై ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఉండగానే, పలువురు నాయకులు వచ్చి కూర్చున్నారు. ఈ విషయమై కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రశ్నించగా, 'మేం పిలవకపోయినా వచ్చి కూర్చుంటున్నారు దానికి మేం ఏం చేయాలి..?' అంటూ అధికారులు చేతులెత్తేశారు. ఇటీవల పున్నేలులో ప్రభుత్వం నిర్వహించిన క్రిస్మస్ కానుకల పంపిణీ కార్యక్రమంలో కూడా కాంగ్రెస్ నాయకులు వేదికపై కూర్చోవడంపై విమర్శలు వచ్చాయి. ఐనవోలు జాతర సమీక్ష సమావేశంలోకి కొందరు నాయకులు ఇలాగే చొచ్చుకవస్తే మంత్రి కొండా సురేఖ వారించి, వారిని బయటకు పంపించారు. అయినప్పటికీ రోజూ ఏదో ఒక కార్యక్రమంలో ప్రొటోకాల్ ఉల్లంఘన జరుగుతూనే ఉందని పలువురు వాపోతున్నారు. ఇదిలావుండగా, ఎమ్మెల్యే అధికారిక కార్యక్రమాల షెడ్యూల్‌ను ఇటు అధికారులు గానీ, అటు ప్రభుత్వ పీఏగాని ముందస్తుగా తెలుపడం లేదని స్థానిక ప్రజాప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

చైల్డ్ డెవలప్ మెంట్ సెంటర్ ప్రారంభం

సుబేదారి, జనవరి 4: దివ్యాంగ పిల్లల కోసం బాలసముద్రంలో గురువారం చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సెంటర్ మాస్టర్ ఆఫ్ ఆక్యుపెన్షనల్ థెరపిస్టు డాక్టర్ అంకు కుమార్, చైల్డ్ సైకాలజిస్టు డాక్టర్ లీనా మాట్లాడుతూ.. ఈ సెంటర్‌లో పుట్టిన పిల్లల నుంచి 15 యేళ్ల పిల్లల వరకు ఎదుగుదలలో ఎలాంటి లోపం ఉన్నా, మాటలు రాకపోయినా, చదువులో వెనుకబడిన పిల్లలకు నిపుణులైన డాక్టర్లతో చికిత్స చేయిస్తామన్నారు. దివ్యాంగ పిల్లలకు ఇంకా అనేక రకాలైన లోపాలకు చికిత్స చేస్తామని, ఈ నెల 10వరకు ఉచితంగా చూస్తామన్నారు. దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు.

జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య

కాజీపేట, జనవరి 4: అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.. కాజీపేట ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట దర్గాకు చెందిన దేవర వెంకటేశ్వర్లు (42) కూలిపని చేస్తూ మద్యానికి బానిసై తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య దేవర శ్రీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



దేవరాజు(ఫైల్)

కమలాపూర్, జనవరి 4 : కమలాపూర్ మండలంలోని గూడూరు గ్రామ శివారులో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన మంద దేవరాజు(24) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్‌ఐ కరుణాకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండలోని ఓ రెస్టారెంట్‌లో పనిచేస్తున్న యువకుడు స్వగ్రామం నుంచి అంబాల గ్రామ వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న ఓ చెట్టును ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ కరుణాకర్ సంఘటన స్థలానికి చేరుకొని ప్రాథమిక విచారణ చేపట్టారు. ప్రమాదానికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్‌ఐ తెలిపారు. కాగా, సంఘటన స్థలంలో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

వనదేవతల సన్నిధిలో వైద్య, విద్యుత్ ఉన్నతాధికారులు



వనదేవతలను దర్శించుకుంటున్న ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

మేడారం, జనవరి 4: ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారంలో తెలంగాణ రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ రవీందర్‌నాయక్, ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి, డైరెక్టర్ మోహన్‌రెడ్డి గురువారం వేర్వేరుగా పర్యటించారు. వనదేతలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మహాజాతరకు తమ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న పనుల పరిశీలించారు. ఈసందర్భంగా హెల్త్ డైరెక్టర్ రవీందర్‌నాయక్ మాట్లాడుతూ వనదేవతల మహాజాతరలో భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామన్నారు. భక్తులకు ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడతామన్నారు. ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ మహాజాతరకు నిరంతరం విద్యుత్ సరఫరా అందించేవిధంగా ప్రత్యేక చర్యలు చేపట్టామని అన్నారు. వరద ముంపుతో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లు ధ్వంసమైనప్పటికీ వెనువెంటనే మరమ్మతులు చేపట్టి నిరంతరం విద్యుత్ అందించేదిశగా పనులు పూర్తి చేస్తున్నామని అన్నారు. కోటి 50 లక్షలకు పైగా వచ్చే మేడారం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని తెలిపారు. 230 ట్రాన్స్‌ఫార్మర్లు, తొమ్మిదిన్నర కిలోమీటర్ల విద్యుత్‌లైన్లు పూర్తిచేశామని అన్నారు. పార్కింగ్ స్థలాలు, ఆర్టీసీ బస్టాండ్, గద్దెల ప్రాంగణం, జంపన్నవాగు ప్రాంతాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను అందుబాటులో ఉంచామని అన్నారు. వారి వెంట డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య, సీజీఎం మోహన్‌రావు, ఎస్ఈ మల్హార్‌నాయక్, డీఈ రాజేశ్వర్‌రావు, ఏడీఈ స్వామిరెడ్డి, ఏడీ వేణుగోపాల్, ఏఈ వేణుకుమార్, ఇతర విభాగాల డీఈలు, ఏడీలు, ఏఈలు ఉన్నారు.



వనదేవతలను దర్శించుకుంటున్న రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ రవీందర్‌నాయక్

పాలకుర్తిలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి కబడ్డీ క్రీడలు

పాలకుర్తి, జనవరి 4 : పాలకుర్తి మండల కేంద్రంలో యువ చైతన్య యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 12, 13, 14 తేదీల్లో 10వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నట్లు యువ చైతన్య యూత్ బాధ్యులు ఎడవెల్లి సోమేశ్వర్ తెలిపారు. స్థానికంగా గురువారం ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాల నుంచి యవ చైతన్య యూత్ ఆధ్వర్యంలో కబడ్డీ క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచిన జట్లకు నగదుతో పాటు మెమోంటోలు అందచేస్తామని చెప్పారు. మొదటి బహుమతి రూ.20వేలు, ద్వితీయ బహుమతి రూ.15వేలు, తృతీయ బహుమతి రూ.10వేలు, నాల్గవ బహుమతి రూ.8వేలు, ఐదవ బహుమ తి రూ.6వేలు, ఆరవ బహుమతి రూ.4వేల నగదును అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే ఆసక్తి గల జట్లు 8328004828, 9676428932, 995969 5365 నంబర్లను సంప్రదించాలని కోరారు.

మహిళపై దాడి

హనుమకొండ క్రైం, జనవరి 4: షట్టర్ యజమాని మాట్లాడనివ్వలేదని మహిళపై ఇద్దరు దాడి చేసి షాపును ధ్వంసం చేసిన ఘటన హనుమకొండ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. హనుమకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ న్యూరాయపురకు చెందిన వంగాల వాణిశ్రీ హనుమకొండ పోలీసు స్టేషన్ ముందు లైన్‌లో ఓ షట్టర్ అద్దెకు తీసుకుని లేడీస్ ఎంపోరియం నడిపిస్తోంది. షాపు ముందు ఉన్న గాదం స్వరూప, గాదం శృతిలు బుధవారం సాయంత్రం షాపునకు వచ్చి వాణిశ్రీతో గొడవకు దిగారు. తమతో చాలా రోజులుగా ఎందుకు మాట్లాడడం లేదని, ఇంటి యజమాని మాట్లాడవద్దని చెప్పడంతోనే తమతో మాట్లాడడం లేదని వాణిశ్రీపై ఇద్దరు గొడవకు దిగారు. వాణిశ్రీపై దాడి చేయడంతో పాటు షాపులో ఉన్న ఫర్నిచర్, సామగ్రిని ధ్వంసం చేశారు. తనపై దాడి చేయడంతో పాటు సుమారు రూ. 30 వేల విలువ గల సామగ్రిని ధ్వంసం చేసినట్టు పోలీసుకు బాధితురాలు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు. ప్రస్తుతం స్వరూప, శృతి పరారీలో ఉన్నట్టు పోలీసులు వెల్లడించారు.

అట్రాసిటీ కేసులో ఇద్దరి అరెస్టు

మహాముత్తారం, జనవరి 4: అట్రాసిటీ కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్టు కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి గురువారం వెల్లడించారు. మహాముత్తారం మండలంలోని మాదారానికి చెందిన ఎం.డి.అలావుద్దీన్, షఫీయొద్దీన్ డిసెంబరు 30న మాదారంలో ఎన్నికల విధుల్లో ఉన్న స్థానిక అంగన్‌వాడీ టీచర్ బెల్లంకొండ భీమక్క విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా ఆమెను కులంపేరుతో దూషించారని తమకు ఫిర్యాదు అందిందన్నారు. దీంతో ఇద్దరిపై కేసు నమోదు విచారణ అనంతరం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. ఇదే ఘటనలో అంగన్‌వాడీ టీచర్ విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురిపై కూడా కేసునమోదు చేశామన్నారు.

మత్తు పదార్థాలపై యువతకు అవగాహన



మహాముత్తారంలో మాట్లాడుతున్న కాటారం సీఐ రంజిత్‌రావు

చిట్యాల, జనవరి 4: మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై యువతకు, విద్యార్థులకు పోలీసులు గురువారం అవగాహన కల్పించారు. మండల కేంద్రంలో ఈ కార్యక్రమం గురువారం జరిగింది. సీఐ వేణుచందర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. చెడు అలవాట్లు చేసుకొని జీవితాలను దుర్భరం చేసుకోవద్దని సూచించారు. పాఠశాల స్థాయి నుంచి మంచి అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని కష్టపడి విజయం సాధించాలన్నారు. మహిళలు, చిన్నారులపై ఆకృత్యాల నివారణ కోసం ప్రభుత్వం రక్షణ చట్టాలు తీసుకొచ్చిందన్నారు. డ్రగ్స్, గంజాయి మత్తు పదార్థాల సమాచారం తెలిస్తే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఎస్సై జంగిలి రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో కానిస్టేబుళ్లు అస్లం జానీ, నవీన్, లింగన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● టేకుమట్ల : మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌సీ పాఠశాలలో విద్యార్థులకు ఎస్సై సుధాకర్ గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలన్నారు. గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో ఎవరైనా మత్తు పదార్థాలు కొనుగోలు చేయడం గానీ, అమ్మకాలు చేయడం గానీ చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. విద్యార్థులు చదువుపై ఏకగ్రతతో ఉండాలని సూచించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● గణపురం: మండల కేంద్రంలోని మోడల్ కళాశాల విద్యార్థులకు మత్తు పదర్థాలపై పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ వేణుచందర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగంతో యువత భవిష్యత్ అంధకారం అవుతుందని అన్నారు. కాలేజీ దశ నుంచే మత్తు పదార్థాలకు దూరం గా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాలు ఎవరైనా అమ్ము తున్నా, సేవిస్తున్నా వెంటనే సమాచారం అందించాలని కోరారు. డ్రగ్స్‌తో కలిగే అనర్థాల ను విద్యార్థులకు వివరించారు. క్రమశిక్షణతో చదువుకుని భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సాంబమూర్తితో పాటు కళాశాల ప్రిన్సిపాల్ సుమన్ పాల్గొన్నారు.



చిట్యాలలో మాట్లాడుతున్న సీఐ వేణుచందర్

● మహాముత్తారం: మత్తు పదార్థాలపై యువతకు కాటారం సీఐ రంజిత్‌రావు అవగాహన కల్పించారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఈ కార్యక్రమం జరిగింది. యువకులు ఎక్కువగా మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారని, ఇది సమాజానికి ఏమాత్రం మంచిది కాదన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలను సరఫరా చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మత్తు సేవించినా, అమ్మినా కఠిన చర్యలు తప్పవని అన్నారు.

రబీకి రెడీ

- ముమ్మరంగా ప్రారంభమైన వరినాట్లు
- వ్యవసాయ పనులతో పొలాల్లో సందడి
- పెరిగిన ఎరువుల ధరలు, కూలీల రేట్లు



శివపురంలో పొలంలో ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న రైతు

ఏటూరునాగారం, జనవరి 4 : రైతన్నలు బిజీ అయ్యారు. రబీ సీజన్ (యాసంగి) పంటకు సిద్ధమయ్యారు. ఏటూరునాగారం డివిజన్‌లోని ఏజెన్సీ మండలాలలో వారం రోజులుగా యాసంగి వరినాట్లు ఊపందుకున్నాయి. బోరు బావులు, చెరువులు, కుంటల కింద రైతులు వేసిన వరి నారు ఏతకు రావడంతో వరి నాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఖరీఫ్ సీజన్(వర్షాకాలం)లో పండిన పంటల ధాన్యం ఇంకా అక్కడక్కడ కొన్ని గ్రామాల్లో కోతలు కొనసాగుతున్నాయి. అయినప్పటికీ యాసంగి వరి నాట్లు ప్రారంభమయ్యాయి. గత ఖరీఫ్‌లో చివరి దశకు వచ్చిన వరి పంటలు పొలాల్లో కోతలకు సిద్ధంగా ఉన్న వరి మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో మూడు రోజుల పాటు గాలి, దుమారం, ఈదులు గాలులతో కురిసిన భారీ వర్షాలకు చేతికి వచ్చిన వరి పంటలు నేలమట్టమయ్యాయి. దీంతో రైతులు నష్టాలను చవి చూశారు. దీంతో ఈ యాసంగిలో కొండంత ఆశతో రైతులు ముందుగానే యాసంగి పంటలకు రంగం సిద్ధం చేసుకున్నారు.

ఖరీఫ్ సీజన్లో రైతులకు దిగుబడులు రాకపోవడంతో ప్రస్తుతం యాసంగికి ఎరువుల ధరలతో పాటు కూలీల రేట్లు పెరిగాయని రైతులు వాపోతున్నారు. వరి నాట్లకు నార్లు ఎదగడంతో రైతులు వరి నాట్లు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. పొలాలను ట్రాక్టర్ల దమ్ము చక్రాలతో, ఎడ్ల నాగళ్ల ద్వారా దుక్కిదున్నడం, దమ్ముచేయడం లాంటి పనుల్లో రైతులు బిజీబిజీగా ఉన్నారు. ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లి, పెద్ద వెంకటాపురం, శివపురం, గోగుపల్లి, రామన్నగూడెం, రాంనగర్, లంబాడితండా, కొయాగూడ ఎల్లాపురం, రొయ్యూరు, శంకరాజుపల్లి, షాపల్లి, కొండాయి, కొత్తూరు, దొడ్ల కొత్తూరు, మల్యాల, ఐలాపూర్, చల్పాక, బానాజీబంధం, వీరాపురం, ఎలిశెట్టిపల్లితోపాటు మంగపేట, వాజేడు, వెంకటాపురం(నూగూరు), కన్నాయిగూడెం తదితర మండలాల్లోని గ్రామాలో ఈ యాసంగి సీజన్‌లో బోరు బావులు, చెరువులు, కుంటల కింద మండలాల వ్యాప్తంగా సుమారు 15 వేల విస్తీర్ణంలో వరి పంటను రైతులు సాగు చేస్తున్నట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. కాగా యాసంగిలో అధిక దిగుబడులు వచ్చేందుకు వ్యవసాయ అధికారులు ముందు నిలిచి శిక్షణ తరగతుల ద్వారా రైతులకు పలు సూచనలు, సలహాలు ఇవ్వాలని మండల రైతులు కోరుతున్నారు.

పెరిగిన ధరలు

అన్నదాతలకు ఏటా పెట్టుబడి ఖర్చులు పెరిగిపోతున్నాయి. ట్రాక్టర్, నాగళ్లతో దమ్ముచేయడం, దుక్కిదున్నేందుకు ఎకరాకు రూ. 2 వేల నుంచి రూ. 4 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. ఎరువుల ధరలు, కూలీల రేట్లు పెరుగుతున్నాయి. ఆరుగాలం కష్టపడినా చివరికి పంట చేతికందుతుందన్న నమ్మకమూ లేదు.

శిక్షణ తరగతుల ద్వారా సూచనలు ఇస్తాం..

- జనగాం వేణుమాధవ్, ఉద్యాన అధికారి

మండల వ్యాప్తంగా సుమారు 5 వేల ఎకరాల్లో యాసంగి వరి పంట సాగు చేస్తున్నారు. యాసంగిలో అధిక దిగుబడులు వచ్చేందుకు రైతులకు శిక్షణ తరగతుల ద్వారా పంట పొలాల్లో వ్యవసాయ శాఖ అధికారుల బృందంతో పర్యటించి రైతులకు అవగాహన సదస్సుల ద్వారా సూచనలు, సలహాలు ఇస్తాం.



శివపురం, చిన్నబోయినపల్లిలో వరి నాట్లు వేసిన కూలీలు

మాదిగలు ఉద్యమించాలి : సోమశేఖర్

జనగామ టౌన్, జనవరి 4 : మాదిగ జాతి భవిష్యత్ కోసం ఆ వర్గానికి చెందిన ఉద్యోగులు, యువకులు, విద్యార్థులు ఉద్యమించాలని ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు చిప్పలపల్లి సోమశేఖర్ పిలుపునిచ్చారు. గురువారం జనగామలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జిల్లా అధ్యక్షుడు గద్దల కిశోర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విద్యార్థుల సదస్సులో ఆయన మాట్లాడారు. మాదిగ హక్కుల సాధన, అన్ని రంగాల్లో వాటా, భావితరాల భవిష్యత్ కోసం యుద్ధానికి సిద్ధం కావాలన్నారు. మంద కృష్ణమాదిగ సారథ్యంలో విద్యార్థి ఉద్యమాన్ని బలోపేతం చేస్తామని చెప్పారు.



మాట్లాడుతున్న చిప్పలపల్లి సోమశేఖర్

ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య

వెంకటాపురం(నూగూరు), జనవరి 4: మద్యంమత్తులో ఉరివేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కేకొండాపురం గ్రామంలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని కురుసం చంటి(22) రోజూ మద్యంసేవిస్తూ గ్రామంలో దుబారా తిరిగేవాడని, గురువారం మద్యంమత్తులో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని అన్నారు. మృతుడి తల్లి పీరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

భూపాలపల్లిటౌన్, జనవరి 4: భూపాలపల్లి పట్టణంలోని అంబేద్కర్ క్రీడా మైదానంలో జరుగుతున్నన కబడ్డీ పోటీలను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసానికి తోడ్పాటునందిస్తాయని అన్నారు. క్రీడాస్ఫూర్తితో ఆడాలని సూచించారు. గెలుపోటములు సహజమని అన్నారు. గెలిచిన వారు మరో అడుగు ముందుకు వేయడానికి కృషి చేయాలన్నారు. ఓటమి చెందిన వారు దాని కారణాలను వెతికి అధిగమించాలని సూచించారు. క్రీడల్లో ఉన్నతంగా రాణించి దేశ, రాష్ట్ర ఔన్నత్యాన్ని చాటాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాట్ల శ్రీనివాస్, పిప్పాల రాజేందర్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే

6న ములుగులో శ్రీరాముడి అక్షింతల పంపిణీ

ములుగు కలెక్టరేట్, జనవరి 4: శ్రీక్షేత్ర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అయోధ్య శ్రీరామమందిర పూజిత అక్షింతల పంపిణీ కార్యక్రమం ఈనెల 6వతేదీన ములుగు పట్టణంలో నిర్వహించనున్నట్లు సీతారామాంజనేయ దేవస్థాన కమిటీ అధ్యక్షుడు గండ్రకోట కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అత్యంత సుందరంగా అలంకరించిన స్వామివారి రథం పట్టణంలోని ప్రతిగడపు చేరుకుంటుందని, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అక్షింతలు తీసుకోవాలని అన్నారు. అక్షింతలను శుభకార్యాల్లో పవిత్రంగా వాడుకుంటే అన్ని శుభాలు జరుగుతాయని తెలిపారు.

అక్రమ నిర్మాణాలను అరికట్టాలి : ఎమ్మార్పీఎస్

కాటారం, జనవరి 4: మండలంలోని పలు గ్రామాల శివారుల్లో ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో అక్రమంగా జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను అధికారులు అరికట్టాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మంథెన చిరంజీవి గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూముల్లో కొందరు ఉద్యోగులు, భూస్వాములు ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. అధికారుల అండదండలతోనే నిర్మాణాలు జరుగుతున్నాయని, వాటిని నిలిపేయకుంటే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్నాలు చేపడుతామని హెచ్చరించారు.

'ప్రజాపాలన'లో అసౌకర్యాలు కలగొద్దు

అదనపు కలెక్టర్ వేణుగోపాల్

మంగపేట, జనవరి, 4: ప్రజాపాలన గ్రామసభల్లో దరఖాస్తులు ఇవ్వడానికి వచ్చే ప్రజలకు అసౌకర్యాలు కలగకుండా అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అన్నారు. మండలంలోని మల్లూరు, వాడగూడెం, తిమ్మంపేట, కొత్తమల్లూరు గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమానికి గురువారం ఆయన హాజరయ్యారు. ప్రజాపాలనలో ప్రజల వద్ద నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియాను ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి చేయాలని అన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులందరికీ పథకాలు అమలు చేస్తామన్నారు. ప్రభుత్వ గ్యారెంటీ పథకాలతోపాటు ఇతర సమస్యలపై అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారని తెలిపారు. వాటి కోసం ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, మండల స్పెషల్ ఆఫీసర్ తుల రవి, తహసీల్దార్ వీరస్వామి, ఇన్‌చార్జి ఎంపీడీవో ఆలేటి సుదర్శన్, ఎంపీవో మమత, నాయబ్ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు, ఆర్‌ఐలు కుమారస్వామి, ఏసుపాదంతో పాటు ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మల్హర్, జనవరి 4 : మండలానికి 45 కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు మంజూరైనట్లు తహసీల్దార్ శ్రీనివాస్ గురువారం తెలిపారు. మండలంలోని చిన్నతూండ్ల, నాచారం, ఎడ్లపల్లి గ్రామాలకు 2, కొండంపేట 7, మల్లారం 6, పెద్దతూండ్ల 5, రుద్రారం 3, వల్లెంకుంట 1, తాడిచర్ల గ్రామానికి 17 మంది లబ్ధిదారులకు చెక్కులు వచ్చినట్లు వివరించారు. శుక్రవారం ఉదయం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

ఆర్టీఐ రక్షణ వేదిక క్యాలెండర్ ఆవిష్కరణ

మల్హర్, జనవరి 4: మండల కేంద్రమైన తాడిచర్ల తహసీల్దార్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం రక్షణ వేదిక క్యాలెండర్‌ను తహసీల్దార్ శ్రీనివాస్ గురువారం ఆవిష్కరించారు. అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, అవినీతికి అడ్డుకట్ట వేయడానికి సమాచార హక్కు చట్టాన్ని ఆయుధంగా వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం రక్షణ వేదిక మండల పూర్తిస్థాయి కమిటీని మండల అధ్యక్షుడు చింతల కుమార్‌యాదవ్ ప్రకటించారు. మండల ఉపాధ్యక్షుడిగా చొప్పరి రాజయ్య, ప్రధాన కార్యదర్శిగా శనిగల లక్ష్మణ్, కార్యదర్శిగా బండి సుధాకర్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

మంగపేట ఇన్‌చార్జి ఎంపీడీవోగా సుదర్శన్



మంగపేట, జనవరి 4: ఇన్‌చార్జి ఎంపీడీవో ఆలేటి సుదర్శన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన కర్నాటి శ్రీధర్ బుధవారం మృతి చెందగా ఆయన స్థానంలో సుదర్శన్‌కు బాధ్యతలు అప్పగించారు. సూపరింటెండెంట్‌గా ఉన్న ఆయన్ను ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమిస్తూ జడ్పీ సీఈవో ప్రసూనరాణి ఉత్తర్వులు జారీ చేశారు.

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ



విద్యార్థులకు దుప్పట్లు అందజేస్తున్న జడ్పీటీసీ రమణ

వెంకటాపురం(నూగూరు), జనవరి 4: మండలంలోని టేకులబోరు, మొర్రవానిగూడెం, బర్రెబొంద, ఆలుబాక, రామచంద్రాపురం, ఎదిర గ్రామాల్లో గ్రేస్‌హోమ్ సొసైటీ ఆధ్వర్యంలో దుప్పట్లు, చలికోట్లు, నిత్యావసర సరుకులను జడ్పీటీసీ పాయం రమణ 450 మంది విద్యార్థులకు గురువారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థలు సహాయసహకారాలు అందించడం అభినందనీయమని అన్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని మరికొందరు ముందుకు రావాలని ఆమె కోరారు. ఈకార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు జెట్టి శామ్యూల్, మురళీధర్‌రెడ్డి, కోర్స జ్యోతి, రజిని, ముర్రం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రేస్ సొసైటీ ఆధ్వర్యంలో..

వాజేడు : మండలంలోని మొరుమూరు గ్రామపంచాయతీ పరిధి బొల్లారం గ్రామంలో గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో సమకూర్చిన దుప్పట్లు, స్వెటర్లు, గిఫ్ట్‌ప్యాకెట్లు, బొమ్మలను పేద విద్యార్థులకు ఎంపీపీ శ్యామల శారద గురువారం పంపిణీ చేశారు. పేద విద్యార్థులను గుర్తించి వారికి దుప్పట్లు, ఇతర వస్తువులు అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్‌కేర్ సిబ్బంది మురళిరెడ్డి, శామ్యూల్, పాస్టర్ కంతి శ్యామ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఫిట్స్‌తో బాలుడి మృతి



దుర్గం సిద్ధు (ఫైల్)

కాటారం, జనవరి 4: మండల కేంద్రమైన కాటారం జీపీ పరిధిలోని ఎస్సీ కాలనీకి చెందిన దుర్గం సిద్ధు(16) అనే బాలుడు ఫిట్స్‌తో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బీజేపీ జిల్లా మాజీ కోశాధికారి అయిన దుర్గం తిరుపతి కుమారుడు అయిన సిద్ధు గురువారం ఇంట్లో మంచంలో నిద్రిస్తున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో అకస్మాత్తుగా ఫిట్స్ రావడంతో తల నవారులో ఇరుక్కుని శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిగా మారింది. తల్లిదండ్రులు ఇంటికి వచ్చేసరికి సిద్ధు మృతి చెందాడు. గతంలోనూ ఫిట్స్ వ్యాధి ఉండగా మందులు వాడుతున్నట్లు బంధువులు తెలిపారు.

నర్సరీలను సమర్థంగా నిర్వహించాలి

కాటారం, జనవరి 4: తెలంగాణకు హరితాహారంలో భాగంగా చేపట్టిన నర్సరీలను సమర్థంగా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి సంజీవరావు, ఎంపీడీవో శంకర్ అన్నారు. మండలంలోని చింతకాని, ఇబ్రహీంపల్లి, ప్రతాపగిరి తదితర జీపీల పరిధిలో ఏర్పాటు చేస్తున్న నర్సరీలను గురువారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ టీఏలు, ఎఫ్ఏలు, జీపీ కార్యదర్శులు, నర్సరీల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. మొక్కలు మొలకెత్తకుంటే బ్యాగుల్లో మళ్లీ విత్తనాలు వేయాలన్నారు. రోజు రెండు పూటలా వాటరింగ్ చేయాలన్నారు. టార్గెట్ ప్రకారం మొక్కల పెంపకం చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో వెంకన్న, పంచాయతీ కార్యదర్శులు నాగరాజు, మల్లికార్జున్‌రెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.


యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు

తాడ్వాయి, జనవరి 4: మండల కేంద్రంలోని ఇందిరానగర్ జడ్పీహెచ్ఎస్ ఆవరణలో టీఎస్ యూటీఎఫ్ క్యాలెండర్‌ను గురువారం ఆసంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు సుతారి పాపారావు మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం టీఎస్ యూటీఎఫ్ ముందుండి పోరాడుతుందని అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న మూడు కరువుభత్యం బకాయిలను విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు, ఉపాధ్యాయులు రేగ కేశవరావు, చంద్రారెడ్డి, మంద రవీందర్, మంకిడి స్వామి, ఈక రవికుమార్, పాయం కీర్తిమంతరవు, రజిత, రేణుక, శాలిని, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులను పకడ్బందీగా ఆన్‌లైన్ చేయాలి



గ్రామసభలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీడీవో, ఎంపీవో

కాటారం, జనవరి 4: ప్రభుత్వం అభయహస్తంలో భాగంగా ఆరు గ్యారెంటీల అమలు చేయడానికి చేపట్టిన ప్రజాపాలన గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తులను పకడ్బందీగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మండల ప్రత్యేకాధికారి సంజీవరావు, ఎంపీడీవో శంకర్‌నాయక్ అన్నారు. మండలంలో పలు జీపీల పరిధిలో కొనసాగుతున్న ప్రజాపాలన సదస్సులు జరుగుతున్న తీరును గురువారం వారు పరిశీలించారు. దరఖాస్తులతోపాటు సంబంధిత జిరాక్స్ ప్రతులను సేకరించాలని ఆదేశించారు. మండల వ్యాప్తంగా 24 జీపీల పరిధిలో గురువారం నాటికి 12,004 అభయహస్తం, నూతన రేషన్‌కార్డులు, ఇతర సమస్యలపై దరఖాస్తులు వచ్చాయని ఎంపీవో ఉపేంద్రయ్య తెలిపారు. 11,322 అభయహస్తం దరఖాస్తులు రాగా రేషన్ కార్డులు, ఇతర సమస్యలపై 682 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీవో వెల్లడించారు. గ్రామసభల్లో సర్పంచులు, జీపీ ప్రత్యేకాధికారులు, జీపీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.